క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును రాష్ట్ర టెలికాం డైరెక్టర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. గ్రామానికి చెందిన మద్దిలేటికి వైద్య చికిత్స నిమిత్తం రూ.60 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, బోయ అంజి, కుర్వ మధు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అయిజ: ప్రైవేటు పాఠశాలల యజమానులు విద్యార్థును చేరవేస్తున్న బస్సులు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులను మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాములు, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, సాయికృతి తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

పురాతన కట్టడాలను సంరక్షించాలి



గద్వాల: జిల్లాలో ఉన్న పురాతన కట్టణాలు, బావులను సంరక్షించాలని సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్‌రావు, అచ్చన్నగౌడ్ ఎంపీ మల్లురవిని కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాదులో ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో వృథాగా ఉన్న స్కానింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిర్మాణం మధ్యలో ఆగిన ప్రభుత్వ ఐటీఐ కాలేజీని పూర్తి చేయాలని పేర్కొన్నారు.

వర్గీకరణ మేరకు ధ్రువీకరణ పత్రాలివ్వాలి

గద్వాల: ఎస్సీ వర్గీకరణ ప్రకారం జిల్లాలో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ వి. లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖలో జరుగబోవు జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగరాజు, హనుమంతు, ఆనందం, శాంతిరాజు, సుందర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పునఃప్రారంభం



గట్టు: మండల పరిధిలోని చాగదోన ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు పునఃప్రారంభించారు. ఇటీవల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం అధికారులు వంట ఏజెన్సీ నిర్వాహకులతో చర్చించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అయ్యస్వామి పాల్గొన్నారు.

రైతును ఏమార్చిన దుండగులు

గద్వాల క్రైం: మీ సేవ కేంద్రంలో గుర్తు తెలియని దుండగులు రైతు చొక్కా జేబులో నుంచి నగదు అపహరించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. ధరూరు మండలానికి చెందిన రైతు శ్రీను మంగళవారం ఉదయం క్రాప్‌లోన్ రెన్యూవల్ కోసం గద్వాలలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో మీ సేవ నుంచి ఆర్‌ఓఆర్, పహణీలను తీసుకురావాల్సిందిగా బ్యాంకు అధికారులు సూచించడంతో మీ సేవ కేంద్రానికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు శ్రీను చొక్కా జేబు నుంచి రూ.16 వేలు నగదు అపహరించారు. మీసేవ కేంద్రంలోని సీసీ కెమెరా రికార్డు పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు నగదును అపహరించినట్లు గుర్తించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గద్వాల క్రైం: నిర్లక్ష్యంగా కారును నడుపుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... జిల్లా కేంద్రంలోని హీరో హోండా షోరూం సమీపంలో టీజీ 33ఏ 1781 నంబర్ గల కారును డ్రైవర్ మద్యం మత్తులో నడుపుతూ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టాడు. ప్రమాదంలో కారు ధ్వంసమైంది. కారును అక్కడే వదిలి డ్రైవర్ పరారైనట్లు స్థానికులు పేర్కొన్నారు.

యథేచ్ఛగా అక్రమ వెంచర్లు

- ఫాంహౌస్ పేరుతో ప్లాట్ల అమ్మకాలు
- అనుమతి లేని వాటికి లేఅవుట్లు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



ఉండవెల్లిలో ఫాంహౌస్ పేరిట వెంచర్ ఏర్పాటు చేసిన స్థలం

ఉండవెల్లి: మండలంలోని మేజర్ పంచాయతీల్లో ప్లాట్ల పంచాయతీలు అధికంగా నడుస్తున్నాయి. మండల పరిధిలోని డి.బూడిదపాడు, పుల్లూరు శివారు ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వెంచర్లుగా మార్చి, హద్దురాళ్లను పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ఉండవెల్లి, డి.బూడిదపాడు, బైరాపురం, పుల్లూరు, ఇటిక్యాలపాడు, తక్కశీల శివారులో రియల్ దందా జోరుగా కొనసాగుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

దారులు మూసేస్తున్నారు..

వెంచర్ల ఏర్పాటులో భాగంగా రైతుల పొలాలకు వెళ్లేందుకు దారులు మూసేస్తున్నారు. డి.బూడిదపాడు, ఉండవెల్లి, బైరాపురం గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో అనుమతులు తీసుకోకుండానే వెంచర్లు ఏర్పాటు చేశారు. బైరాపురంలో ఓ బడా లీడర్ వెనకుండి వెంచర్లు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ పొలాల్లో వెంచర్లు వేస్తూ పొలాలకు దారి కూడా లేకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడి ఒకవైపు డబ్బులు చేతులు మారుతున్న తరుణంలో వాటికి అధికారులు కూడా చేతులు తడుపుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫాంహౌస్ పేరిట ప్లాట్ల అమ్మకాలు

మండల కేంద్రంలో ఓ చోట పేరుకు మాత్రమే ఫాంహౌస్, అక్కడ అన్ని ప్లాట్లే ఉన్నాయి. వెంచర్ పేరిట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తొలగించారు. మరోచోట ఆర్డీఎస్ స్థలాన్ని కబ్జా చేసి రైస్‌మిల్లును నిర్మిస్తున్న వ్యాపారవేత్తలు వెంచర్ ఏర్పాటు చేశారు. డి.బూడిదపాడు శివారులో లేఅవుట్ లేకుండానే లేపాక్షి వెంచర్ పేరుతో ప్లాట్ల విక్రయాలు కొనసాగిస్తున్నారు. మండల పరిధిలో ఇలా చాల పేర్లతో అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డి.బూడిదపాడులో అనుమతులు లేని వెంచర్



ఉండవెల్లిలో ఆర్డీఎస్ స్థలంలో అక్రమ నిర్మాణం

గ్రామాల్లో వెంచర్ల ఏర్పాటు

ప్రతి గ్రామంలో వెంచర్లు ఏర్పాటు చేసి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పొలాలకు వెళ్లాలంటే గోడలు అడ్డుగా కడుతున్నారు. దారి లేదని తేల్చి చెబుతున్నారు. రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదు.

– మోయినుద్దీన్, బైరాపురం

నిబంధనల మేరకే ..

గ్రామాల్లోనైన, రైతుల పొలాలను అమ్మకాలు చేసి వాటికి నాలా కన్వెన్సన్ తీసుకుంటేనే అనుమతులు జారీ చేస్తాం. ఫాంహౌస్ పేరుతో ప్లాట్ల విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటాం. అనుమతులు ఉన్న వెంచర్ల యజమానులు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ప్రభాకర్, తహసీల్దార్, ఉండవెల్లి

అనుమతి లేని వాటిపై చర్యలు

పంచాయతీ పరిధిలో ఉన్న వెంచర్లకు అనుమతులు ఉంటేనే ప్లాట్ల అమ్మకాలు జరపాలి. అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకుంటాం. మండల పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్లు పరిశీలించేందుకు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. లేపాక్షి వెంచర్‌కు అనుమతులు లేవు.

– తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

బాలింతలు జాగ్రత్తలు పాటించాలి



షేకుపల్లిలో బాలింత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న వైద్యాధికారి రాధిక

ఎర్రవల్లి: వర్షాకాలంలో బాలింతలు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. మంగళవారం మండల పరిధిలోని షేకుపల్లిలో వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవమైన అయిన బాలింతల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. చిన్నారులకు క్రమం తప్పకుండా తల్లిపాలను ఇవ్వాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. చిన్నారులు, బాలింతలకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు లక్ష్మి, అనిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

ధరూరు: వాహన తనిఖీల్లో భాగంగా మంగళవారం రాత్రి మండల పరిధిలోని చింతరేవులలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టుపై పొంచి ఉన్న ప్రమాదం

ఇటిక్యాల: జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. జింకలపల్లి స్టేజీ సమీపంలో కాల్వపై నిర్మించిన కల్వర్టు రక్షణ గోడలు శిథిలమవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు వద్ద రక్షణ గోడ, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



జింకలపల్లి స్టేజీ సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



ధర్మాపురంలో నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు



అజ్జకొల్లులో ..

అమరచింత/మదనాపురం: మండలంలోని ధర్మాపురంలో మంగళవారం పోచమ్మ దేవత బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కురుమ, యాదవ సోదరులు డోళ్ల చప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

❖ మదనాపురం మండలంలోని అజ్జకొల్లులో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మహిళలు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా రాజవర్ధన్



కేటీదొడ్డి: మండల వ్యవసాయ శాఖ అధికారిగా యెనమెట్ల రాజవర్ధన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో బాధ్యతలు నిర్వర్తించిన ఆయన కేటీదొడ్డికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సాజిద్ రెహమాన్ బదిలీపై జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి టెక్నికల్ ఏఓగా వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది రాజవర్ధన్‌కు అభినందనలు తెలియజేశారు.

ఏటీఎం పనిచేయక అవస్థలు

రాజోళి: శాంతినగర్ పట్టణంలో ఎస్‌బీఐ ఏటీఎం పనిచేయకపోవడంతో వినియోగదారులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. నగదు లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఏటీఎం సర్వీసు లేకపోవడంతో కమీషన్లు తీసుకుని డబ్బు ఇచ్చే వారిని ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.



పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



గట్టు: పశువుల ఆరోగ్యంపై రైతులు దృష్టిని సారించాలని జీవనోపాధుల అధికారి అక్బర్‌పాష సూచించారు. మంగళవారం వాయిల్‌కుంటతండాలో భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. గొర్రెలు, మేకలు, గేదెలు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశు పోషణపై రైతులకు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పశువైద్యాధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రియాంక, సహాయకుడు పృధ్వీ, ఖాజా, కార్యదర్శి నాగరాజుగౌడు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



ఇటిక్యాల: మిషన్ భగీరథ పథకంపై అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కరువైంది. మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిండి రోజుల తరబడి నీరు వృథాగా పారి చెరువును తలపిస్తుంది. నీరు వృథాగా పోతున్న అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీటిని ఆదా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీపీయూఎస్ సభ్యత్వ నమోదు



మానవపాడు: మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి, జిల్లా టీపీయూఎస్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఉపాధ్యాయులతో సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో నాయకులు మధు, కరుణకార్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అయిజ: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబానికి మాజీ ఎంపీటీసీ శ్రీధర్ మంగళవారం రూ. 30 వేలు నగదు ఆర్థిక సాయం చేశారు. పట్టణానికి చెందిన బోయ వీరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కి భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తె ఉన్నారు. వారు అద్దె ఇంట్లో ఉండి జీవనం సాగిస్తూ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆర్థిక సాయం చేసినట్లు శ్రీధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, రమేష్, వీరన్న పాల్గొన్నారు.

స్పందించిన మున్సిపల్ అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

రోడ్డుకు మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అయిజ: 'సాక్షి' పత్రికలో ఇటీవల వచ్చిన 'తహసీల్దార్ కార్యాలయానికి చేరేదెలా?' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లే రోడ్డుకు ఎర్రమట్టిని వేసి మరమ్మతు చేసే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు సాక్షితో మాట్లాడారు. రోడ్డుపై ఎర్రమట్టితో గుంతలు పూడ్చి రోడ్డు చదును చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బస్టాండులో మౌలిక వసతులు కల్పించాలి



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా భగత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు పెంచే ఆలోచనే ధ్యాసే కానీ ప్రయాణ ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశం లేదని మండిపడ్డారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో కూర్చునేందుకు సరిపడా కుర్చీలు, బెంచీలు లేవని, ఆరుబయట ఉండాల్సి వస్తుందన్నారు. ఎండకు, వానకు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంగణ పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉన్నాయన్నారు. తక్షణమే మౌలిక వసతులు కల్పించకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమసేనరావు, ప్రదీప్‌కుమార్, నాగరాజు, వీరేష్‌గౌడ్, మాధవాచారి, రాజు, రఘు, రాజశేఖర్, సోమశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టీబీ అనుమానితులకు పరీక్షలు నిర్వహించాలి

మానవపాడు: మండలంలోని ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆయా గ్రామాల్లో టీబీ అనుమానితులకు తప్పనిసరిగా గళ్ల పరీక్షలు నిర్వహించాలని వైద్యురాలు హేమమానస అన్నారు. మంగళవారం ఏఎన్‌ఎమ్‌లకు, ఆశాలకు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా ఐరన్‌మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెలెన్, అబేదుల్ల, అక్కమ్మ, సంధ్య, అనూష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యురాలు హేమమానస

ప్రతి విద్యార్థి బయోమెట్రిక్ తీసుకోవాలి

ధరూరు: మండలంలోని ప్రతి పాఠశాలలో బయోమెట్రిక్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని మండల విద్యాధికారి రవీంద్రబాబు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని సోంపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల బయోమెట్రిక్ విధానాన్ని స్వయంగా చూశారు. ప్రతి ఒక్కరి బయోమెట్రిక్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పారుచర్ల గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, మెనూ భోజనం అందించాలని సూచించారు. ఎములోనిపల్లి పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



సోంపురంలో బయోమెట్రిక్ నమోదును పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ర్యాంప్ ప్రాజెక్టుపై అవగాహన పెంచుకోవాలి

గట్టు : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు నెలకొల్పడానికి ఏర్పాటు చేసిన ర్యాంపు ప్రాజెక్టుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర ఎస్‌ఈడీ సూర్యప్రకాష్‌గౌడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ర్యాంపు ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈడీ మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను తెలుసుకొని, ప్రతి వ్యక్తి పారిశ్రామికవేత్తగా ఎదగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన డీఈఈపీలో పోర్టల్ పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామాల్లోని నిరుద్యోగులు డీఈఈపీలో నమోదు చేసుకొని ఉద్యోగ అవకాశాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఈడీపీ అసిస్టెంట్ మేనేజర్ శ్యామల, ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్, సీసీలు శివకుమార్, జ్యోతి, సుదర్శన్, దేవదాసు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులు సత్ప్రవర్తనతో విజయం సాధించాలి

గద్వాలటౌన్: విద్యార్థులు సత్ప్రవర్తనతో జీవితంలో విజయం సాధించాలని జిల్లా విద్యా సమన్వయ అధికారి ఎస్తేరురాణి సూచించారు. జనాభా విద్యలో భాగంగా ఎస్సీఈఆర్టీ ఆదేశాల మేరకు విద్యార్థులకు కామిక్ రైటింగ్ (హాస్య సంభాషణ రచన)పై మంగళవారం స్థానిక బాలభవన్‌లో సేనో బిఫోర్ ఇట్.. ఈస్ టూ లేట్ (ఆలస్యం కాకముందే వద్దని చెప్పు) అనే అంశంపై పోటీలు నిర్వహించారు. పోటీలకు జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ బహుమతి ప్రభుత్వ మోమిన్‌మొహల్లాకు చెందిన విద్యార్థిని హారిక, ద్వితీయ బహుమతి ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి లక్ష్మీనారాయణచారి, మూడో బహుమతి ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన అఫన్ గెలుపొందారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసపత్రాలు అదజేశారు. కార్యక్రమంలో శివకుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న అధికారులు

పాఠశాలలో మాదిరి ఎన్నికలు

మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం సర్పంచ్, వార్డు సభ్యుల మాదిరి ఎన్నికలు జీహెచ్‌ఎం నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

